సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం | 29 | నవంబర్ | 2024



ఉత్తమ సమాజ నిర్మాణం జరగాలి

ప్రపంచీకరణతో సమాజంపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతోందని, ఉత్తమ సమాజ నిర్మాణం జరగాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో▸



ఏసీబీ వలలో పీఆర్ ఏఈ

వరంగల్ పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయం డ్రాయింగ్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ కార్తీక్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
28.1^{0} /20.0^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం చలి గాలులు వీస్తాయి. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు స్వామివారి కల్యాణం

రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్రం సందర్భంగా నేడు (శుక్రవారం) స్వామి వారి కల్యాణం జరపనున్నట్లు ఆలయ ఈఓ మహేష్ తెలిపారు. ఉదయం సుదర్శన నరసింహ హోమం, స్వామి వారి అభిషేకం అనంతరం కల్యాణం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



భూపాలపల్లి అర్బన్: విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేశారని విమర్శిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ప్రాంత కార్య సమితి సభ్యుడు వేల్పుల రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా 51మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వివిధ కారణాలతో చనిపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన కూడా లేదన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌కుమార్, వికాస్, సాయి, రామ్‌చరణ్, లక్ష్మణ్, బంటి, విఘ్నేష్, సంతోష్, విష్ణు పాల్గొన్నారు.

విద్యార్థినికి మాంటిస్సోరి యాజమాన్యం బాసట



భూపాలపల్లి అర్బన్: కాలేయ వ్యాధితో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాఠశాల విద్యార్థిని పి.మోహనసాయిప్రియకు మాంటిస్సోరి పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్పీ కిరణ్‌ఖరే హాజరై విద్యార్థిని తండ్రి యుగేంద్రచారికి రూ.2,38,260 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను, యాజమాన్యాన్ని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జోస్ నెడుంతుండం, అధ్యక్షుడు గండ్ర సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



పలిమెల: మండలంలోని సర్వాయిపేటలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం డీఆర్‌డీఓ నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను నమ్మిమోసపోవద్దని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ గోవింద్, ఏపీఎం రవికుమార్, సమాఖ్య ప్రెసిడెంట్ స్వరూప, కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

డిసెంబర్ 4న న్యాస్ పరాక్ సర్వే



చిట్యాల: మండలంలోని సెలెక్టెడ్ పాఠశాలల్లో డిసెంబర్ 4న జరిగే న్యాస్ పరాక్ సర్వే (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)ను విజయవంతం చేయాలని న్యాస్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.రమేష్, జిల్లా అకాడమిక్ కో ఆర్డినేటర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, రేగొండ, గోరికొత్తపల్లి ఐదు మండలాలకు చెందిన సూపర్‌వైజర్‌లు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలాలలో ఎంపికైన పాఠశాలల్లో సర్వే విజయవంతం చేయడంలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల పాత్ర కీలకం అన్నారు. ఎంఈఓ కొడెపాక రఘుపతి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 3, 6, 9 తరగతుల విద్యార్థుల విద్యా సామర్థ్యాలను తెలుసుకునేందుకు న్యాస్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్పీ రతన్‌సింగ్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి పాల్గొన్నారు.

వన్యప్రాణుల వేట

అడవుల్లో ఉచ్చులు పెడుతున్న వేటగాళ్లు

- అటవీ మాంసానికి డిమాండ్
- పట్టణాలకు తీసుకువెళ్తూ సొమ్ముచేసుకుంటున్న వైనం
- తగ్గిన అటవీశాఖ నిఘా



కాళేశ్వరం: జిల్లాలో రోజుకో చోట అడవుల్లో వన్యప్రాణుల వేట జరుగుతోంది. సంబంధిత అటవీశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో యథేచ్ఛగా వన్యప్రాణుల వేట జరుగుతోంది. భూపాలపల్లి, మహదేవపూర్, చిట్యాల, టేకుమట్ల, రేగొండ, మహాముత్తారం, మల్హర్ అటవీప్రాంతాల్లో ఎక్కువగా వేట జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ వేటాడిన మాంసాన్ని పట్టణాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఉచ్చులు తగ్గేదెలా..

అటవీప్రాంతాల్లో వేట షరామామూలు అయింది. నిత్యం అటవీగ్రామాల్లో వేట కోసం విద్యుత్ తీగలకు ఉచ్చులు తయారుచేసి వేస్తున్నారు. దానికి మూగజీవాలతో పాటు జిల్లాలో రైతులు మృతిచెందిన ఘటనలు ఉన్నాయి. గతేడాది నవంబర్‌లో కాటారం–మహదేవపూర్ అటవీప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తున్న యువ పోలీసు కానిస్టేబుల్ విద్యుత్ ఉచ్చుకు తగిలి ప్రాణాలు కోల్పోయాడు. కొన్ని రోజులు తగ్గుముఖం పట్టిన వేట మళ్లీ షురూ అయింది.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

గతేడాది పెద్దఎత్తున అటవీ, పోలీసు, విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అప్పటినుంచి కాస్త స్తబ్దుగా ఉన్న పల్లెల్లో మళ్లీ ఏదో ఒక చోట వేట జరుగుతుంది. వేటగాళ్లు దొరికి జైలు పాలవుతున్నా మారడం లేదు.

ఇతర ప్రాంతాల నుంచి..

గతంలో ఇక్కడ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దుప్పుల వేట మాదిరిగానే ప్రస్తుతం పట్టణాల నుంచి కూడా వేటాడేందుకు కొంతమంది వేటగాళ్లు అడవి బాట పడుతున్నారని తెలిసింది. వారంలో ఒకరోజు అడవులు ఉన్న ప్రాంతానికి చేరుకొని వేటాడుతున్నారని వినికిడి. ఇప్పటివరకు అటవీశాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఉచ్చులు బిగించే బ్యాచ్‌లు సైతం మళ్లీ వేటకు రెడీ అవుతున్నారని తెలిసింది.

తగ్గిన నిఘా..

ఎన్ని కౌన్సెలింగ్‌లు చేసినా వేటగాళ్ల తీరు మారడం లేదు. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అటవీశాఖ ప్రత్యేక నిఘా విభాగాలు రాత్రి వేళల్లో గస్తీలు నిర్వహించడం లేదు. పెట్రోలింగ్ టీంలు, ఫ్లయింగ్‌స్క్వాడ్ విభాగాల తనిఖీలు, సోదాలు తగ్గాయని తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వణ్యప్రాణులకు రక్షణ కల్పించాల్సి అవసరం ఉంది.



పట్టణాలకు మాంసం..

అడవుల్లో వేటాడిన దుప్పులు, కుందేలు, అడవి పందులు, ఏదు, కొండగొర్లు, అడవి పక్షులను ఉచ్చులు, కత్తులతో హతమార్చి మాంసాన్ని పట్టణాలకు, తమ బంధువులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్‌లో అటవీ మాంసం విలువ కిలోకు రూ.600లకు పైనే పలుకుతుంది. దీంతో కొనుగోలు చేసేందుకు మాంసం ప్రియులు ఇష్టపడుతున్నారు. వరంగల్, హనుమకొండ, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు నిత్యం ఆర్టీసీతో పాటు ఇతర ప్రైవేట్ వాహనాల్లో మాంసాన్ని తరలిస్తున్నట్లు సమాచారం.

అవగాహన కల్పిస్తున్నాం..

క్యాచ్ ద ట్రాప్స్ అనే కార్యక్రమం ద్వారా అనుమానం ఉన్న ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అనుమానిత ప్రాంతాల్లో రాత్రి పెట్రోలింగ్ చేపడుతున్నాం. ఉచ్చులు బిగించకుండా అటవీమార్గంలో విద్యుత్ లైన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. వేటగాళ్లను నిర్మూలించడానికి ప్రయత్నం చేస్తున్నాం.

- రవి, అటవీశాఖ రేంజర్, మహదేవపూర్

కేసుల విచారణలో జాప్యంచేస్తే చర్యలు

- పెండింగ్ కేసులు పరిష్కరించాలి
- ఎస్పీ కిరణ్ ఖరే



మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: కేసుల విచారణలో జాప్యంచేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని, పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో పోలీసు అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల విచారణను త్వరగా పూర్తిచేసి చార్జ్‌షీట్‌లు దాఖలు చేయాలన్నారు. ప్రతీ కేసుకు సంబంధించి ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలన్నారు. లక్ష్యం నిర్దేశించుకుని విధులు నిర్వర్తించాలని చెప్పారు. దొంగతనాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చోరీ కేసుల్లో అన్ని కోణాల్లో విచారణ చేసి దుండగులను గుర్తించి సొత్తును రాబట్టాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసు అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిషేధిత గంజాయి, డ్రగ్స్ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు(బ్లాక్ స్పాట్స్)ను గుర్తించి, ప్రమాదాల నివారణకోసం సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళలపై జరిగే నేరాల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానంతోనే సమాజ అభివృద్ధి

భూపాలపల్లి అర్బన్: శాస్త్రీయ విజ్ఞానంతోనే సమాజ అభివృద్ధి జరుగుతుందని ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ మాంటిస్సోరి హైస్కూల్‌లో నిర్వహించగా ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానవ పరిణామ క్రమం గురించి విద్యార్థులను ప్రశ్నించారు. జీవితంలో ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని కలిగి ఉండాలన్నారు. సైన్స్ మన అభివృద్ధి కోసం వాడుకోవాలని, చెడు పనులకు వినియోగించరాదన్నారు. విద్యార్థులందరూ తమ కలలను సాకారం చేసుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. అత్యవసర సమయాలలో పోలీస్ సేవలు అందుబాటులో ఉంటాయని షీ టీమ్స్, 100 సర్వీస్‌లను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పొగాకుల రాధాకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు, నాయకులు రాజు, సాంబయ్య, బొట్ల కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, లక్ష్మిప్రసన్న, సాంబమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

రైతుల భూముల పరిశీలన

మొగుళ్లపల్లి: గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేలో తమ విలువైన, సారవంతమైన భూములు కోల్పోతున్నామని మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన రైతులు ఆర్డీఓ మంగీలాల్‌కు ఫిర్యాదు చేయగా గురువారం ఆర్డీఓ రైతుల భూములను పరిశీలించారు. భూములను పరిశీలించిన అనంతరం తుది నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సునీత, ఆర్‌ఐ సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



రైతుల భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ మంగీలాల్

మల్లంపల్లి మండల గెజిట్ విడుదల



మల్లంపల్లి మండల ఏర్పాటుతో సంబురాలు జరుపుకుంటున్న మండల సాధన సమితి నాయకులు

ములుగు రూరల్: ములుగు జిల్లాలోని మల్లంపల్లిని నూతన మండలంగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌ను ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ గురువారం విడుదల చేశారు. దీంతో పది మండలాలతో ములుగు జిల్లా స్వరూపం ఏర్పాటు కానుంది. మల్లంపల్లి మండలం ఏర్పాటు చేయాలనే ప్రజల ఆకాంక్షను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి మంత్రి సీతక్క పలుమార్లు తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన పరిపాలనా సౌలభ్యం కోసం మల్లంపల్లి మండలం ఏర్పాటు చేశారు. ఇంతకు ముందు ములుగు మండల పరిధిలో ఉన్న పంచాయతీలు మల్లంపల్లి, మహ్మద్‌గౌస్‌పల్లి, పందికుంట, శివతండా, రాంచంద్రాపురం, కొడిశలకుంట, దేవనగర్, శ్రీనగర్, గుర్తూర్‌తండా, ముద్దునూరు తండాలకు కలుపుకొని నూతనంగా మల్లంపల్లి మండలాన్ని ఏర్పాటు చేశారు. ఈ పది పంచాయతీలతో మల్లంపల్లి, రాంచంద్రాపూర్ రెవెన్యూ గ్రామాల పరిధిని మండలంగా ఏర్పాటు చేయడం జరిగింది.


మండల ఏర్పాటుకు అలుపెరగని ఉద్యమాలు

నూతన మండలం కోసం మల్లంపల్లి గ్రామస్తులు రాజకీయాలకు అతీతంగా జేఏసీ ఏర్పాటు చేసుకొని మండల సాధన సమితి పేరుతో అలుపెరుగని ఉద్యమాలు చేసి మండలం సాధించుకున్నారు. మాజీ జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ మరణం అనంతరం మల్లంపల్లి ప్రజలు జేడి మల్లంపల్లి మండలంగా ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. ఎట్టకేలకు మల్లంపల్లి మండలం ఏర్పాటు చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు, సాధన సమితి నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామస్తుల చిరకాల వాంఛ నేరవేరడంతో ప్రజలు సంబురాల్లో మునిగితేలారు.



మల్లంపల్లి నేమ్ బోర్డు


సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు



ప్రజల ఆకాంక్షల మేరకు మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి డాక్టర్ ధనసరి సీతక్కకు కృతజ్ఞతలు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పటి నుంచి ఈ ప్రాంత వాసులు మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీ మేరకు మంత్రి సీతక్క ప్రభుత్వాన్ని ఒప్పించి మండలంగా ఏర్పాటు చేసేందుకు చాలా కష్టపడ్డారు. చివరిగా ప్రజలకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చింది.

- పైడాకుల అశోక్, డీసీసీ అధ్యక్షుడు

మల్లంపల్లి ప్రాంత వాసులకు శుభాకాంక్షలు



అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేశాం.. ఈ ప్రాంత వాసులకు శుభాకాంక్షలు. ఇచ్చిన మాటను సీతక్క మరిచిపోదనే విషయాన్ని ప్రజలు గుర్తించాలి. కొంత మంది ఓట్ల కోసమే హామీలు ఇస్తున్నారని తప్పుడు ప్రచారం చేశారు. వారందరికీ మల్లంపల్లి మండల ఏర్పాటు గెజిట్ చెంపదెబ్బగా మారింది. అడిగిన వెంటనే స్పందించి గెజిట్ నోటిఫికేషన్ విడుదలయ్యేలా కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలు రుణపడి ఉంటారు.

- ధనసరి సీతక్క, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి

మీతోపాటే నేనూ..

- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్
- ప్రతీ శుక్రవారం మధ్యాహ్న భోజనం తనిఖీ
- కలెక్టర్ రాహుల్ శర్మ





వండిన అన్నాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, కిచెన్‌లో సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్

మల్హర్: విద్యార్థులతో పాటే నేనూ అంటూ.. కలెక్టర్ నేలపై కూర్చుని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మండలంలోని మల్లారం కస్తూర్బా గాంధీ పాఠశాలలోని మధ్యాహ్నం భోజనాన్ని గురువారం కలెక్టర్ రాహుల్ శర్మ తనిఖీ చేశారు. 'ఆరు బయటే వంట' అనే శీర్షికతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పరిస్థితిపై గురువారం సాక్షి ప్రచురించిన కథనానికి కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఈ సందర్భంగా పాఠశాలలోని బియ్యం, నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్నారు. నాణ్యత లోపించిన వస్తువులను వాడరాదని సంబంధిత ఎస్‌ఓ (స్పెషల్ ఆఫీసర్)ను ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ముఖాముఖి చర్చ నిర్వహించి అల్పాహారం, భోజన సదుపాయాల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. అల్పాహారం, భోజనం బాగుంటుందా, సరిపోను పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చెప్పిన సమాధానాలకు సంతృప్తి వ్యక్తంచేశారు. భోజనం రుచిగా ఉందని ఎస్‌ఓను, వంట సిబ్బందిని కలెక్టర్ ప్రశంసించారు. భవిష్యత్‌లో కూడా ఇలాగే ఆహార నాణ్యతను పాటించాలని సూచించారు. చలికాలంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సోలార్ విద్యుత్‌కు మరమ్మతులు చేపించాల్సి ఉందని ఎస్‌ఓ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ఆహార నాణ్యత పరిశీలనకు ప్రతీ శుక్రవారం తహసీల్దార్, ఎంపీడీఓలు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయాలని ఆదేశించారు.

జాప్యంలేకుండా కొనుగోలు చేయాలి

17 శాతం తేమ ఉంటే జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ సెంటర్ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని తాడిచర్ల, పెద్దతూండ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. తేమ శాతాన్ని పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత గల ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాల్లో నిల్వ ఉంచకుండా ట్యాగ్ చేసిన మిల్లులకు వెంటనే రవాణా చేయాలని అధికారులను ఆదేశించారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని తనిఖీ చేశారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సర్వే సమగ్ర సమాచారం పూర్తిగా గోప్యతగా ఉంచాలని, బయటికి వెళ్లకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రంథాలయ భవనం, సహకార సంఘ భవనాలను పరిశీలించి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి వాల్యానాయక్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యాం సుందర్, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండెయ్య, వైస్ చైర్మన్ మల్క ప్రకాశ్‌రావు, మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, సీఈఓ సంతోష్ పాల్గొన్నారు.



కిచెన్‌లో కూరగాయలను పరిశీలించి వంట నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్

దేవాదులలో పంపింగ్ నిలిపివేత



కన్నాయిగూడెం: మండల పరిధిలోని గుట్టల గంగారం గ్రామ సమీపంలో గల దేవాదులలో మోటార్ల పంపింగ్‌ను గురువారం అధికారులు నిలిపివేశారు. గత కొన్ని నెలల నుంచి పంపింగ్ కొనసాగించిన విషయం తెలిసిందే. ఎగువ ప్రాంతంలో నీటి వినియోగాన్ని బట్టి పంపింగ్ కొనసాగిస్తామని డీఈఈ శరత్ తెలిపారు. ప్రస్తుతం పంపింగ్ వద్ద 79.30 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది. తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్కసాగర్ బ్యారేజీ వద్ద 79.30 మీటర్లు నీటిమట్టం ఉండగా బ్యారేజీలోకి ఎగువ ప్రాంతం నుంచి 33వేల నీటి ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలో 59 గేట్లు ఉండగా అందులో 3గేట్లను మాత్రమే ఓపెన్ చేసి 33వేల నీటిని దిగువకు వదులుతున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

చిట్యాల/టేకుమట్ల: చిట్యాల, టేకుమట్ల మండలాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం మండలంలోని దూత్‌పల్లి, అందుకుతండా, గిద్దెముత్తారం, టేకుమట్ల మండల కేంద్రంతో పాటు వెలిశాల గ్రామంలోని కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం రికార్డుల నిర్వహణ, ట్యాబ్ ఎంట్రీలను పరిశీలించారు. సక్రమంగా డేటా ఎంట్రీ చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధ్యానం కొనుగోలు కేంద్రాల ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రోజువారి నమోదు ప్రక్రియలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాద్, తహసీల్దారు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఓపెన్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: ఓపెన్ ఇంటర్, టెన్త్ ప్రవేశాలకు ప్రత్యేక దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు డిసెంబర్ 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి కేయూ డిగ్రీ పరీక్షలు

- మొదటి, మూడో, ఐదో సెమిస్టర్లు..
- హాజరుకానున్న 1,77,274 మంది విద్యార్థులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ కోర్సుల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి గురువారం తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలకు 70,610 మంది, మూడో సెమిస్టర్ పరీక్షలకు 59,872 మంది, ఐదో సెమిస్టర్ పరీక్షలకు 46,792 మంది విద్యార్థులు మొత్తం 1,77,274 మంది పరీక్షలు రాయబోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 46, ఖమ్మం జిల్లాలో 29, ఆదిలాబాద్ జిల్లాలో 46 మొత్తం 121 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.మొదటి సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు, మూడో సెమిస్టర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ఐదో సెమిస్టర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు. హాల్‌టికెట్లు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచగా ఆయా కళాశాలలు డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు అందజేస్తున్నాయి.

‘ఓపెన్’లో ప్రవేశాలకు అవకాశం

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ఈవిద్యాసంవత్సరంలో అడ్మిషన్లకు చివరి అవకాశం కల్పించారు.డిసెంబర్ 2నుంచి 11తేదీ వరకు ఆసక్తి ఉన్న వారు ప్రవేశాలు పొందాలని హనుమకొండ డీఈఓ వాసంతి, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ అనగోని సదానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సమీపంలోని ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలల్లోనూ సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో మాత్రమే అడ్మిషన్లు పొందాల్సింటుందన్నారు. అభ్యర్థులు స్వయంగా అడ్మిషన్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌ద్వారా చెల్లించి అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ ఫామ్ ప్రింట్‌అవుట్‌తోపాటు వెంటనే సమర్పించాల్సింటుందన్నారు. వివరాలకు ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సదానందం సెల్ నంబర్ (9346020003),(9396337572)లో సంప్రదించొచ్చు.

కాంటా.. కళకళ

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెరిగిన పత్తి కొనుగోళ్లు

- ఈ నెల26వ తేదీ నాటికి 12,71,831 క్వింటాళ్లు..
- గతేడాదితో పోల్చితే రెండింతల కంటే ఎక్కువ పెరిగిన కొనుగోళ్లు
- తేమ శాతం తగ్గడంతోనే..

వరంగల్ : కాంటా కాటన్ తూకంతో కళకళలాడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 19 వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలోని ప్రైవేట్ వ్యాపారులతో పాటు 58 సీసీఐ కొనుగోలు కేంద్రా(జిన్నింగ్ మిల్లు)ల్లో ఈనెల 26వ తేదీ నాటికి 12,71,931 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు వరంగల్ ఆర్‌జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. తేమ శాతం తగ్గడంతో పత్తి కొనుగోళ్లు పెరిగాయని తెలిపారు. గత ఏడాది కంటే ఈఏడాది ఎక్కువ మొత్తంలో కొనుగోళ్లు జరిగాయని తెలిపారు. గత ఏడాది ఇదే తేదీ నాటికి 5,17,572 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరగగా ఈఏడాది 12,71,831 క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయన్నారు.



విక్రయించేందుకు వచ్చిన పత్తి వాహనాలు

జిల్లా	జిన్నింగ్ మిల్లులు	ప్రైవేట్(క్వి)	సీసీఐ(క్వి)	మొత్తం
వరంగల్	26	1,86,043	3,65,479	5,51,522
హనుమకొండ	4	28,652	22,169	50,821
జనగామ	15	1,09,044	3,07,217	4,16,261
మహబూబాద్	6	23,169	1,04,955	1,28,124
ములుగు	3	13,198	38,534	51,732
భూపాలపల్లి	4	8,611	64,760	73,371
మొత్తం	58	3,68,717	9,03,114	12,71,831

ఉత్తమ సమాజ నిర్మాణం జరగాలి

- ప్రపంచీకరణతో సమాజంపై ప్రతికూల ప్రభావం
- కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి
- కేయూలో జాతీయ సదస్సు



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : ప్రపంచీకరణతో సమాజంపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతోందని, ఉత్తమ సమాజ నిర్మాణం జరగాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కేయూలో సోషియాలజీ, సోషల్‌వర్క్ విభాగం ఆధ్వర్యంలో ‘గ్లోబలైజేషన్‌డెవలప్‌మెంట్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మ్యాపింగ్ ది ట్రాజెక్టరీస్ ఆఫ్ సోషల్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ప్రాసెస్‌ఇన్ కాంటెంపరరీ ఇన్ ఇండియా’ అనేఅంశంపై రెండు రోజులు జరిగే జాతీయ సదస్సు ప్రారంభ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచీకరణ నేపథ్యంలో భారతదేశంలో వృద్ధ జనాభాపై ప్రభావం రేపటి సమస్య అన్నారు. ప్రపంచీకరణ మానవ సమాజంపై అత్యంత ప్రభావం చూపిందన్నారు. సోషియాలజీలో ఆ దిశగా పరిశోధకులు పరిశోధనలు చేయాలని సూచించారు. ప్రత్యేక అతిథి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీకి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్సిటీ మరోరెండేళ్లలో ఎంతో అభివృద్ధి చెందబోతుందన్నారు. యూనివర్సిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారన్నారు. త్వరలోనే యూనివర్సిటీ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించబోతున్నారన్నారు. వృద్ధులు, పిల్లలకు సంబంధించిన అంశాలపై కూడా పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం మాజీ డీన్, రిటైర్డ్ ఆచార్యుడు కె. శ్రీనివాసులు కీలకోపన్యాసం చేస్తూ ప్రపంచీకరణ కేవలం ఆర్థిక వ్యవస్థమీదే కాదని అన్నిరంగాలపై కూడా అత్యంత ప్రభావం చూపిందన్నారు. వలసవాదులతో గ్రామీణ భారతం విచ్ఛిన్నం అయిందన్నారు. సెమినార్ డైరెక్టర్, సోషియాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. యూనివర్సిటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ బి. సురేశ్‌లాల్, సోషల్‌సైన్స్‌డీన్ టి. మనోహర్, యూజీసీ కోఆర్డినేటర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, కేయూ ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యుడు కూరపాటి వెంకటనారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు హనుమంతురావు, గణేశ్, అడప సత్యనారాయణ, ఎస్వీ యూనివర్సిటీ ఆచార్యుడు డి. వెంకటేశ్వర్లు , కేయూ రిటైర్డ్ ఆచార్యులు రాములు, సోషియాలజీ విభాగం ప్రొఫెసర్లు స్వర్ణలత, కుంట అయిలయ్య మాట్లాడారు. తొలుత ఈజాతీయ సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. రేపటితో ఈసదస్సు ముగియనున్నది.

బ్రీత్ అనలైజర్ మార్చాలి..

- ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల ధర్నా
- నిలిచిన బస్సులు..
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు



ధర్నా చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు

నెహ్రూసెంటర్: బ్రీత్ అనలైజర్ మార్చాలని, తొలగించిన అద్దె బస్సు డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ అద్దె బస్సు యూనియన్ ఆధ్వర్యంలో గురువారం డిపో ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో బుధవారం ఉదయం డ్రైవర్లతో పాటు అయ్యప్ప మాలధారణ చేసిన డ్రైవర్ శ్రీనివాస్‌ను బ్రీత్‌అనలైజర్‌తో పరీక్ష చేయగా 5 శాతం ఆల్కాహాల్ తీసుకున్నట్లు కనిపించింది. కొంత సేపు ఆపిన అనంతరం విధులకు అనుమతించారు. దీంతో గురువారం యూనియన్ ఆధ్వర్యంలో అద్దె బస్సులను నిలిపివేసి ధర్నా నిర్వహించారు. బ్రీత్ అనలైజర్ సక్రమంగా పని చేయకపోవడంతో గతంలో కూడా కొంత మందిని విధుల నుంచి తొలగించారని, మాలధారణ చేసిన డ్రైవర్‌కు కూడా అదే విధంగా రావడంపై డ్రైవర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. బ్రీత్ అనలైజర్‌ను మార్చాలని, విధుల నుంచి తొలగించి డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై డిపో మేనేజర్‌తో చర్చించగా డ్రైవర్ల సమస్యల పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వగా బస్సులను ఉదయం 10.45 గంటలకు యథావిధిగా నడిపించారు. కాగా, అద్దె బస్సుల డ్రైవర్లు ధర్నాతో 14 బస్సులు గురువారం తెల్లవారు జామునుంచి డిపోనకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

అయ్యప్ప మాలధారుల ఆందోళన

తొర్రూరు: అయ్యప్ప మాలలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌కు బ్రీత్ అనలైజర్ టెస్టు చేయడం దుమారం రేపింది. తాజాగా డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో అయ్యప్ప మాలలో ఉన్న డ్రైవర్ నాగరాజుకు బ్రీత్ అనలైజర్ టెస్టు నిర్వహించారు. కాగా, తమ మనోభావాలు దెబ్బతీశారని ఆరోపిస్తూ గురువారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట అయ్యప్పమాలధారులు ఆందోళన చేపట్టారు. ఆర్టీసీ డీఎం పద్మావతి, ఎస్సై ఉపేందర్ అయ్యప్ప మాలధారులను శాంతిపజేయడానికి యత్నించారు. రోజువారీగా నిర్వహించే విధుల్లో భాగంగానే బ్రీత్ అనలైజర్ టెస్టు నిర్వహించడం జరిగిందని, మాలలో ఉన్న డ్రైవర్‌ను కించపర్చాలనే ఉద్దేశం తమకు లేదని డీఎం తెలిపారు. ఘటనపై బీజేపీ నాయకులు ఆర్‌ఎంకు ఫిర్యాదు చేశారు. డీఎంను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

నిబంధనల ప్రకారమే..

ఆర్టీసీ నిబంధనల ప్రకారం రోజూ విధులకు హాజరయ్యే ప్రతి ఒక్కరిని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తాం. అందులో భాగంగా మాలధారణ చేసిన డ్రైవర్‌ను కూడా పరీక్షించాం. దీంతో అద్దె బస్సు డ్రైవర్లు బస్సులు నిలిపి సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు. దీనిని ఉన్నతాధికారులకు వివరించాం. బ్రీత్ అనలైజర్ గురించి వివరించగా మిషన్ మార్చడంతో పాటు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- శివప్రసాద్, డిపో మేనేజర్,మహబూబాబాద్

ఏసీబీ వలలో పీఆర్ ఏఈ

- ఫైనల్ బిల్లు కోసం రూ.5 వేలు డిమాండ్
- డబ్బు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

వరంగల్: వరంగల్ జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలోని డ్రాయింగ్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ గాదె కార్తీక్.. ఏసీబీ వలలో చిక్కుకున్నారు. రూ. 5 వేలు లంచం తీసుకుంటూ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కడారిగూడెం గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో మంజూరైన మూడు సీసీ రోడ్ల ఫైనల్ బిల్లు చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌ను లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం ఉదయం కాంట్రాక్టర్ హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ వద్ద ఏఈ కార్తీక్‌కు రూ.5వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలు గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. నిందితుడు ఏఈ గాదె కార్తీక్‌ను ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చనున్నట్లు వారు తెలిపారు.



ఏసీబీకి చిక్కిన ఏఈ కార్తీక్

తెలియక విషగుళికలు తిన్న చిన్నారులు

- అపస్మారకస్థితికి చేరిక.. ఆస్పత్రికి తరలింపు

వెంకటాపురం(కె): మండల కేంద్రానికి చెందిన ఇద్దరు చిన్నారులు తెలియక విష గుళికలు తిని అపస్మారక స్థితిలోకి వెళ్లారు. మండల కేంద్రంలోని పెరిక బజారుకు చెందిన జ్ఞానేశ్వర్, జాహ్నవి కవలలు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఉన్న విష గుళికలు తెలియకుండా తిన్నారు. అనంతరం అపస్మరక స్థితిలోకి వెళ్లగా కుటుంబ సభ్యులు గమనించి వెంటనే వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స నిర్వహించకుండానే వైద్యులు ఏటూరునాగారం వైద్యశాలకు రెఫర్ చేశారు. కాగా, వెంకటాపురం మండలానికి చెందిన 108 వాహనం మరమ్మతుకు గురైంది. దీంతో వాజేడు మండల 108 వాహనానికి సమాచారం అందించి గంటకు పైగా ఎదురుచూసినా రాకపోవడంతో గ్రామస్తులు ప్రైవేట్ వాహనంలో చిన్నారులను ఏటూరు నాగారం వైద్యశాలకు తరలించారు.



అపస్మారక స్థితికి చేరుకున్న చిన్నారులను ఎత్తుకున్న తల్లిదండ్రులు

కాటారంలో భారీ చోరీ

- 18 తులాల బంగారం, 50 తులాల వెండి అపహరణ

కాటారం : కాటారం మండలం శంకరాంపల్లి జీపీ పరిధిలోని బుడగజంగాల కాలనీలో భారీ చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి పెద్ద ఎత్తున సొత్తు అపహరించారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అనుముల సత్తమ్మ ఒంటరిగా నివసిస్తోంది. తన కూతురు ప్రసవం నిమిత్తం నాలుగు రోజుల క్రితం ఆస్పత్రికి వెళ్లింది. ఈ క్రమంలో ఇంటికి తాళం వేసి ఉండడం గమనించిన దుండగులు బుధవారం అర్ధరాత్రి సమయంలో తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. తలుపులు తెరిచి ఉండడం గమనించిన చుట్టు పక్కల వారు సత్తమ్మ, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సత్తమ్మ ఇంటికి వచ్చి చూడగా దొంగలు బీరువా తాళం తెరిచి అందులోని 18 తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాలు, టీవీ ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. సీఐ నాగార్జునరావు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించగా, క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. అనంతరం బాధితురాలు సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ధ్వంసమైన బీరువా

పోలీసుల అదుపులో హత్య నిందితులు!

- వివాహేతర సంబంధమే కారణమా?

కాళేశ్వరం : జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం చంద్రుపల్లిలో జరిగిన హత్య నిందితులను మహదేవపూర్, కాళేశ్వరం పోలీసులు గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. మంచిర్యాల జిల్లా కొమ్మెర గ్రామానికి చెందిన మృతుడు ముత్యాల శ్రీకాంత్‌గౌడ్(23)ను బుధవారం నడిరోడ్డుపై పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కత్తితో దారుణంగా హత్య చేసి పరారైన విషయం తెలిసిందే. ఈ ఘటనతో రెండు జిల్లాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. హత్యకు పాల్పడిన అనుమానితులు పెద్దపల్లి జిల్లా మంథని మండలం చందనాపూర్‌కు చెందిన ఇద్దరు, సహకరించిన మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం పొక్కూర్‌కు చెందిన మరో వ్యక్తితో కలిసి ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు మృతుడు, నిందితుల కాల్‌డాటా ఆధారంగా పూర్తి సమాచారం సేకరించినట్లు తెలిసింది. హత్యకు గల కారణాలు, ఎవరెవరు సహకరించారో విచారణను వేగవంతం చేస్తున్నారు. ఈహత్యకు గల కారణం ప్రధానంగా డబ్బులు అప్పుగా ఇవ్వడంతో పాటు మహిళతో వివాహేతర సంబంధమే కారణమని తెలుస్తోంది. గురువారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

మహిళ అకౌంట్‌నుంచి డబ్బులు మాయం

దోర్నకల్: సైబర్ నేరగాళ్ల మాయలో పడి ఓ మహిళ తన ఖాతా నుంచి డబ్బు పోగొట్టుకుంది. డోర్నకల్ సీఐ బి.రాజేశ్ కథనం ప్రకారం.. స్థానిక టంకుతండాకు చెందిన భూక్యా హరిత సెల్‌ఫోన్‌కు ఈ నెల 15న జాబ్ ఇప్పిస్తామంటూ ఓ నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. తాను జాబ్ చేస్తానంటూ తిరిగి మెసేజ్ పెట్టగా బ్యాంకు అకౌంట్ వివరాలు పంపాలని సైబర్ నేరగాళ్లు కోరడంతో పంపింది. దీనికి ప్రతిగా సైబర్ నేరగాళ్లు రూ.250 హరిత అకౌంట్‌కు పంపించారు. అప్పటికే హరిత బ్యాంకు అకౌంట్‌లో రూ.1,01,000 ఉండగా 16వ తేదీన మూడు సార్లు అకౌంట్ నుంచి వివిధ అకౌంట్లకు రూ.86,501 నగదు బదిలీ అయింది. 17న హరిత అకౌంట్ బ్యాలెన్స్ చెక్ చేసుకోగా తనకు తెలియకుండా గుర్తు తెలియని వ్యక్తుల ఖాతాలకు నగదు బదిలీ అయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోర్టల్‌కు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన సైబర్ క్రైం సిబ్బంది హరిత అకౌంట్ నుంచి నగదు బదిలీ అయిన ఖాతాలను పరిశీలించి బదిలీ ప్రాసెస్‌లో ఉన్న రూ.50వేల నగదును హోల్డ్‌లో ఉంచారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

- మీ బంగారం మణప్పురం, ముత్తూట్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694. [SCA24000707]

WANTED

- WANTED Off. Executive / Accountant (Inter/Deg. 0-2yrs Exp, Sal8K-12K), Mktg / Sales Executives (Inter / Deg, FMCG Organic Oils / Food Product Related Exp 0-2yrs, 10K-15K), Production Operaters / Helpers (8K-10K, 10th,Inter,ITI - P/F) Cont: Indl.park, Rampur, HNK. 9919911016. veghannaturals@gmail.com [WA-6534]
- మా అపార్ట్‌మెంట్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్స్, స్వీపర్స్ (స్త్రీ/పురుషులు) అర్జెంట్‌గా కావలెను. సంప్ర॥ 9491710857, 7382106287. [W-1264034]
- మా ఆఫీస్‌లో పని చేయుటకు అర్జెంట్‌గా స్త్రీలు కావలెను. Age: 18-45 Years గల వారు అర్జెంట్‌గా కావలెను. సంప్ర॥ 7382323126, 9491706517. [W-1264035]
- HNK ఆప్టికల్ షాపులో పని చేయుటకు ఉత్సాహవంతులైన సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 10000 నుండి 15000 వరకు. Reddy Opticals. Prop: అన్వేష్ రెడ్డి, Cell: 9652626526. [WA-626]
- హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18K. Ph: 9640258899, 9640468899. [SCA24000705]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బండి.. భద్రత ముఖ్యం

ఏమరుపాటుతోనే రోడ్డు ప్రమాదాలు

- బ్రేక్ ఫెయిలైతే.. వాహనం నుంచి సంకేతాలు
- గుర్తించి సరిచేయిస్తే సురక్షిత ప్రయాణం

నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ఘటనల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. కేవలం చిన్న నిర్లక్ష్యం కారణంగా చాలా మంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వాహనం నడిపే ముందు కండీషన్ చూసుకుంటే ఇలాంటి ప్రమాదాల నుంచి బయట పడొచ్చని మెకానిక్‌లు చెబుతున్నారు. దీనికితోడు వాహనం నడిపే సమయంలో కొన్ని రకాల సంకేతాలు వస్తుంటాయని, వాటిని గుర్తిస్తే ప్రయాణం సురక్షితంగా సాగించొచ్చని పేర్కొంటున్నారు.



కాజీపేట: రోజూ టీవీలు, పత్రికల్లో రోడ్డు ప్రమాదంలో ఇంతమంది చనిపోయారు.. ఇంత మందికి గాయాలయ్యాయి అంటూ వచ్చే కథనాలు చూస్తుంటాం. అయితే ఈ ప్రమాదాలు ఎలా సంభవించాయి? దీనికి గల కారణాలు ఏమిటి? అనే అంశంపై ఎవరూ పెద్దగా దృష్టిసారించరు. ఇలాంటి ప్రమాదాలు బ్రేక్‌లు ఫెయిల్ అవడం వల్లే ఎక్కువ జరుగుతున్నట్లు తెలిసి కన్నీరు మున్నీరుగా విలపిస్తారు. ఇలా చిన్న పొరపాట్లతో విలువైన జీవితాన్ని అర్ధాంతరంగా ముగించేస్తుంటారు. రోజూ వాహనంపై ప్రయాణించే ముందు చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల బారి నుంచి బయటపడొచ్చు. ప్రధానంగా లారీలు, జీపులు, బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల బ్రేక్ కండీషన్లు ప్రత్యేకంగా చూసుకోవాలి. వాహనం అతివేగంతో నడిపే సమయంలో ఒకసారిగా నిలపాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు బ్రేక్‌లు కండీషన్‌లో ఉండాలి. ఈ విషయం చాలా మంది పెద్దగా పట్టించుకోరు. వాహనంలో ఇంధనం ఉందో లేదో.. వాహనం లైట్లు వెలుగుతున్నాయో లేదో.. అనే విషయంపైనే దృష్టి సారిస్తారు తప్ప..బ్రేక్‌లు, వాటి కండీషన్‌ను గమనించే ప్రయత్నం చేయరు. ఈ చిన్న నిర్లక్ష్యం వల్లే అధికంగా బ్రేక్ ఫెయిల్ అయి ప్రమాదాలు సంభవిస్తున్నట్లు మెకానిక్‌లు చెబుతున్నారు. అయితే చాలా మందికి ఈ బ్రేక్ ఫెయిల్ ప్రమాదానికి ముందే తమ వాహనాలు హెచ్చరికలు చేస్తాయట. ఈ వాహనాల నుంచి వచ్చే ఐదు సంకేతాలు క్షుణ్ణంగా వింటే బ్రేక్ ఫెయిల్ అనే సమస్యే రాదని మెకానిక్‌లు చెబుతున్నారు. అవింటో తెలుసుకుందాం..

రాసుకుంటున్న శబ్దం..

వాహనంలో ప్రయాణించే సమయంలో రాసుకున్న, గీసుకున్న శబ్దాలు వస్తే వాహనం బ్రేక్‌లు ఫెయిల్ అవడానికి సిద్ధంగా ఉందని అర్థం. చాలా కంపెనీలు ప్రయాణికుల భద్రత కోసం ఆయా వాహనాల్లో ఇలాంటి శబ్దం వచ్చేలా మెకానిజం ఏర్పాటు చేస్తాయి. బ్రేక్‌లను చివరి వరకు ప్రెస్ చేసినా వాహనం ఆగడం లేదంటే వెంటనే బ్రేక్ షూ మార్చుకోవాలని అర్థం.

గరగరమనే శబ్దం..

వాహనం బ్రేక్ వేసే సమయంలో చక్రాలను నియంత్రించే బ్రేక్ షూ డ్రమ్‌ను గట్టిగా పట్టి ఉంచుతుంది. ఈ రెండింటి మధ్య బ్రేక్ లైనింగ్ ఉంటుంది. వీటిని ఎక్కువ కాలం మార్చకుండా ఉంటే బ్రేక్ షూ అరిగిపోయి డ్రమ్ రాపిడికి గురవుతుంది. ఈ సమయాల్లో ఇలాంటి శబ్దం వస్తే మెకానిక్‌లను సంప్రదించి సరి చేయించుకోవాలి. లేని పక్షంలో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.

కుదుపులు రావడం ద్వారా..

బ్రేక్‌లు ఫెయిల్ అయితే రెండు రకాల వైబ్రేషన్స్ వస్తుంటాయి. మొదటిది వాహనం నడిపే సమయంలో బ్రేక్ వేస్తే పాదం కింద ఉండే పెడల్ వైబ్రేట్ అవుతుంది. ఈ సంకేతం ద్వారా బ్రేక్‌లో తేడా ఉన్నట్లు గుర్తించాలి. రెండు బ్రేక్‌లు వేసినప్పుడు వెహికల్ మొత్తం వైబ్రేషన్ రావడం ఇది అత్యంత ప్రమాదకర సంకేతం. ఈ సంకేతం అందిందంటే బ్రేక్‌లో పెద్ద సమస్య ఉన్నట్లు భావించి వెంటనే సరి చేయించుకోవాలి. అంతేకాక బ్రేక్ పెడల్‌మీద, కాలు మొత్తం వైబ్రేషన్ వస్తుందంటే బ్రేక్‌లో అరుగుదల ఎక్కువ ఉందని గమనించాలి. ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రమాదానికి గురికాక తప్పదు.



బ్రేక్ పెడల్ లోతుగా తొక్కుతున్నారా..

బ్రేక్ పెడల్‌ను లోతుగా తొక్కుతూ వాహనం కంట్రోల్ చేస్తున్నారా? అయితే వాహనం బ్రేక్‌లు వెంటనే సరి చేయించుకోవాలి. బ్రేక్ షూ అరిగితే వెంటనే మార్చడం మంచిది. బ్రేక్‌ల్లో ఫ్లూయిడ్ తక్కువైతే ఇలా జరుగుతుంది. అందుకే వాహనాన్ని వెంటనే మెకానిక్ వద్ద బాగు చేయించుకోవాలి. ఎందుకంటే బ్రేక్ ఫ్లూయిడ్ లేని వాహనం నడపడమంటే ప్రాణాలతో చెలగాటం ఆడడమే అని గుర్తించుకోవాలి.

వెంటనే సరిచేసుకోవాలి



వాహనంలో బ్రేక్ సమస్యలు ఏర్పడితే అశ్రద్ధ చేస్తారు. కొందరైతే అడ్జస్ట్‌మెంట్ చేయించుకుని వెళ్తారు. ఇది సరికాదు. వాహనానికి బ్రేక్‌లు చాలా ప్రధానం. వీటిలో ఎలాంటి లోపం ఉన్నా వెంటనే సరిచేయించుకోవాలి. అలాగే నెలకు ఒకసారైనా వాహనాన్ని ఇంజన్ సైడ్ సర్వీసింగ్ చేయించుకోవడం మంచిది. దీనివల్ల వాహనంలో ఉండే లోపాలను సరిచేసుకునే వీలుంటుంది. తద్వారా ప్రయాణం సాఫీగా జరుగుతుంది. వాహనం నడిపే సమయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి.

-తోట యాదగిరి, మెకానిక్, (మడికొండ)

బ్రేక్ వార్నింగ్ లైట్..

ఇటీవల మార్కెట్‌లోకి వస్తున్న వాహనాలకు ఆయా కంపెనీలు వాహన డ్యాష్ బోర్డులో బ్రేక్ వార్నింగ్ లైట్‌ను అమర్చుతున్నాయి. దీనిలో ఒకవైపు యాంటీ బ్రేక్ లాకింగ్ సిస్టం.. మరోవైపు బ్రేక్ సిస్టం వార్నింగ్ లైట్లు ఉంటాయి. వాహనం రన్నింగ్‌లో ఉన్నప్పుడు బ్రేక్ అప్లయ్ చేస్తే ఏబీఎస్ సిస్టం యాక్టీవెట్ అయ్యి దీనికి అనుసంధానం చేసిన లైట్ వెలుగుతుంది. బ్రేకింగ్, ఏబీఎస్ వ్యవస్థల పనితీరులో ఏ మాత్రం లోపం ఉన్నా బ్రేక్ వార్నింగ్ లైట్లు వెలిగి వాహనదారులను అప్రమత్తం చేస్తాయి. బ్రేక్‌లు ఫెయిల్ అవుతున్నాయనే సందేశాన్ని ఇచ్చిన వెంటనే మెకానిక్ వద్దకు తీసుకెళ్లి సరి చేయించుకోవాలి.